ప్రశ్న

వేమకోటి సీతారామశాస్త్రి
తిమ్మరాజు వీరభద్రయ్య

“అప్పుడు ఏం జరిగిందంటే....” చుట్టూ చూసింది, పాఠం మధ్యలో ఆపేసి సుజాత.

పిల్లలందరూ ఉత్సాహంతో ఏం చెబుతుందో అని ఎదురుచూస్తున్నారు.

స్కూలు వరండాని అరుణకిరణాలు బంగారంతో దీపితము చేస్తున్నాయి.

“క్షతగాత్రులైన సైనికులకు రక్తదానం చేసి ప్రాణదానం చేసిందామె” అన్నది సుజాత తన్మయత్వంతో.

ఆమె పాఠానికి అంతరాయమే కలిగింది.

“మీకు ఫోను వచ్చింది అమ్మగారు.” బంట్రోతు రంగయ్య అన్నాడు.

అంతలోనే స్కూలుబెల్లు మ్రోగింది.

“నాకు ఫోనుచేసేవారు యెవరు చెప్మా” అనుకొని ఆశ్చర్యంగా ఫోను యెత్తింది.

“హల్లో సుజాతగారా....”

“అవును.... మీరు.... ఎవరండి....”

“నేను బ్లడ్ బ్యాంకు నుండి మాట్లాడుతున్నాను. డాక్టర్ రాంబాబుని.”

“నమస్కారం సార్.”

“నమస్కారం. మీరు ఏమీ అనుకోకపోతే చిన్న రిక్వెస్టు. ఒక పేషెంట్ ప్రాణాపాయంలో వున్నాడు. అతనికి కావలసిన గ్రూపు రక్తం అయిపోయింది. మీ గ్రూపు రక్తం సరిపోతుంది. మీరు నాలుగు రోజులక్రితం యిచ్చిన

బ్లడ్ అయిపోయింది. మీరు ఒకసారి రాగలరా" అన్నాడు ఆత్రుతగా.

"వస్తానండి" అని ఫోను పెట్టేసింది.

* * *

ఆ రోజు ఆదివారం శలవు సుజాతకు. ఎనిమిది గంటలు కావస్తోంది. కుర్చీలో కూర్చుని పరీక్ష పేపర్లు దిద్దుకుంటోంది, సుజాత నీరసంగా.

మూడు రోజుల క్రితమే బ్లడ్ బ్యాంకుకు రక్తం యివ్వటంవల్ల మరీ నీరసంగా కనిపిస్తోంది.

తలుపు చప్పుడయింది. "మే ఐ కమిన్..." అన్న పదాలు విన్పించాయి. తీసేసరికి ఎదురుగా అరడుగుల మనిషి. చాలా హుందాగా వున్నాడు.

"సుజాత నువ్వే అనుకుంటానమ్మా." ఆయన గొంతులో ఆప్యాయత కన్పించింది.

"అ.... నేనేనండి... రండి కూర్చోండి" అంది తడబడుతూ, ప్రక్కకు తప్పుకుని.

ఆయన కూర్చున్నారు. గదంతా తేరిపార చూశారు. గోడకు చక్కగా అమర్చబడిన గౌతమబుద్ధుడు, వివేకానంద, ఏసుక్రీస్తు, మహాత్మగాంధీ ఫొటోలు కన్పించాయి. నీటుగా అమర్చిన నాలుగు పేము కుర్చీలు, మధ్య టీపాయిమీదనున్న టేబిల్ క్లాతుపై చేసిన ఎంబ్రాయిడరీ ఆయన్ను ఎంతో ఆకర్షించింది. మూడవప్రక్క కుట్టుమిషనువుంది.

మూల బల్లమీదనున్న ఫిలిప్స్ ట్రాన్సిస్టరు నుండి వస్తూన్న వీణానాదం గదిలో సన్నగా శ్రావ్యంగా వినిపిస్తోంది.

సుజాత ఆశ్చర్యపడుతోంది, యిలాంటి వ్యక్తిని తను ఇంతకుముందు ఎక్కడా, ఎప్పుడూ చూడలేదని. ఆయన్ను చూస్తుంటే యేదో అనిర్వచనీయమైన భావం కలిగింది ఆమెకు.

"ఇంట్లో యెవరూ లేరా అమ్మా .... అంటే మీనాన్నగారుకాని అమ్మగారుకాని."

"నాన్నగారు చనిపోయారండి. ప్రస్తుతం నేను మాత్రమే వుంటున్నాను. నాకు ఎవరూ లేరు" అంది ఆ కంఠంలో బాధ తొణికిసలాడింది.

"అయ్యో పాపం" అన్నారాయన.

"యింతకీ మీరు యెవరో తెలుసుకోవచ్చా" అంది ప్లాస్కులో నున్న హార్లిక్స్ కప్పులోకి వంపుతూ.

"నిన్ను చూస్తుంటే నన్ను నేను పరిచయం చేసుకోవటం మర్చిపోయాను. నా పేరు నీలకంఠం అమ్మా. మూడు రోజుల క్రితం నువ్వు నిలిపిన ప్రాణాన్ని."

సుజాత ఆశ్చర్యపోయింది. ప్రాణదానం చేసేవంటూ కృతజ్ఞతలు చెప్పడానికి రావడం ఆమె జీవితంలో యిదే మొదటిసారి.

ఆమె హృదయంలో సంతోషతరంగాలు ఉవ్వెత్తున లేచాయి. అయితే అనాడు హటాత్తుగా వెళ్ళి అసాధారణ

పరిస్థితులలో రక్తంయిచ్చి కాపాడింది ఈయననే అన్నమాట.

"యిందులో నేను చేసింది ఏముంది. మీ గ్రూపుతో నా గ్రూపు బ్లడ్ సరిపో వడం నా అదృష్టం" అంది ఆనందంగా.

నీలకంఠంగారు గంభీరంగా జేబులో చేయిపెట్టి కొత్త పదిరూపాయల నోట్ల కట్ట బయటకు తీశారు.

"ఇందమ్మా ఈ పదివేల రూపాయ లతో నీ ఋణం తీర్చలేననుకో. అయినా నా సంతృప్తికొద్దీ" అంటూనే టీపాయ్ మీద పెట్టారు.

"ముందు ఆ హార్లిక్సు చల్లారి పోతుంది తీసుకోండి" అంటూ ఆ నోట్ల కట్టను తీసుకొని పేజీలు తిరగేసినట్లు తిరగవేసింది

"మీ ప్రాణం విలువ యింతేనా అండీ" అడిగింది సుజాత నిర్లిప్తంగా.

త్రాగుదామని నోటిదాకా తెచ్చిన హార్లిక్సు కప్పుని టీపాయ్‌మీద పెట్టే శారు అచేతనంగా.

"అవునమ్మా నా ప్రాణం విలువ చాలా తక్కువ అంచనా వేశాను. నా ప్రాణం విలువ నువ్వే సరైన అంచనా వేయి. ఇందుకు ఈ బ్యాంకు చెక్కు తీసుకో" అంటూ జేబులోనున్న చెక్కు బుక్కు తీసి సంతకంపెట్టి టీపాయి మీదవుంచి దానిమీద బరువుగా పదివేల రూపాయల కట్ట వుంచేరు.

సుజాత మొహం జేవురించింది. క్షణం యిద్దరిమధ్యా నిశ్శబ్దం. "ప్రాణం రక్షించినందుకు యిలా డబ్బు తీసుకో వడం ప్రారంభిస్తే నేనూ ఈపాటికి చాలా డబ్బు గడించేదాన్ని. నాకు మీరిచ్చే ఈ డబ్బు పతితలు, భ్రష్టులు, దారి ద్ర్యంతో అలమటిస్తున్న అన్నార్తులను ఆదుకొనగలిగితే మీకు సంతృప్తి లభి స్తుందేమో? ఆలోచించండి" అన్నది ఆవేశంతో కూడిన కోపంతో.

"నీకు ఈ నీలకంఠం సంగతి పూర్తిగా తెలియదమ్మా" అన్నాడు అన హనంగా.

మరో క్షణం ఆగి, "విసుగు విరామం లేకుండా జీవితంలో ఒంటరిగా ప్రయా ణం సాగిస్తున్నాను. అడిగినవారికి లేదన కుండా ఎంతోమందిని ఆదుకున్నాను. ఈ దానధర్మాలు నా బంధువులు నా ప్రాణాల్ని రక్షించలేకపోయాయి, నీ రక్తం తప్ప. అందుకనే నా మాట కాదన కమ్మా. ఈ నా చిన్న కోర్కె తీర్చు. నాకు సంతృప్తిని కలిగించు" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

నీలకంఠం ఆమెనే చూస్తున్నారు యిదివరకు యెక్కడో చూసినట్టు గుర్తు. కాని జ్ఞాపకం రావటంలేదు.

ఒకసారి మీదకు చూశారు. ఆయన ఆలోచనలు మీదన తిరుగుతున్న సీలింగు ఫేనుతో పోటీ పడుతున్నాయి

"మీకూ ఈ సుజాత సంగతి తెలియదండి. ఇందులో వుండే తృప్తిని డబ్బు



జయించలేదు. నా ఈ ఆశయానికి గమ్యస్థానం లేదు." అంది దృఢంగా.

నీలకంఠం అంతర్ముఖులయ్యారు.

"నిండా యిర్వై వసంతాలైనా నిండని నీ జీవితంలో యిటువంటి రక్తదానం చేయటంలో సంపాదించుకున్న ఆత్మతృప్తి ఏమిటో నేను తెలుసుకోవచ్చా" ప్రశ్నించాడు.

అతనికి ఆమెపట్ల వొక విధమైన ఆప్యాయత పెరుగుతోంది, గౌరవంతో పాటు.

చిత్ర విచిత్రమైన మానసిక ప్రవృత్తులు కలిగినటువంటి ఈ మానవ సమాజంలో యిటువంటి మనస్తత్వంగల అమ్మాయి తటస్థపడడం మొదటిసారి నీలకంఠం జీవితంలో.

"తెల్పుకోవటంవల్ల మీకు ఆనందం కలగదు, అయినా మీరు వినాలంటే చెబుతాను."

"ఆనందం పంచుకోకపోయినా నీ వేదనని పంచుకొనే తృప్తిఅయినా మిగలనీ" అన్నారు ఆప్యాయతగా ఆమెవైపు చూస్తూ.

* * *

అర్ధరాత్రి. హాస్పిటల్లో ఎమర్జన్సీ వార్డు హడావుడిగా వుంది. స్ట్రెచర్ మీద సుజాత తల్లిని లోపలికి తీసికెళ్ళారు. ఆమె తలనిండా కట్లు. కట్లను

తెంచుకొని బయటికి రావాలనుకున్న రక్తం రాలేకపోతోంది.

కట్టిన బట్టలు పెళ్ళినారికి అందజేయాలని, ఆ వచ్చే డబ్బుతో సుజాత పరీక్ష ఫీజు కట్టాలన్న తపనతో తొందరగా వెళ్తున్న సుజాత తల్లిని ఓ కారు గుద్దేసింది. కారు ఆమెకి తెలియలేదు. రోడ్డుమీద వున్నవాళ్ళు ఆసుపత్రిలో చేర్చారు. అందులో ఒకరు ఈ కబురు సుజాతకు అందజేశారు.

ఆమె ప్రాణంతో చాలాసేపు పోరాడిన డాక్టర్లకు ఆమె బ్లడ్ గ్రూపు రక్తం కావలసివచ్చింది. హాస్పిటల్లో ఆ గ్రూపు లేదు. "పోనీ నా రక్తం తీసుకుని తల్లిని బ్రతికించండి డాక్టర్" అంది సుజాత. అప్పటికి ఆమెకు పదాహారు సంవత్సరాలకన్నా ఎక్కువ వుండవు.

తన రక్తం ఎప్పుడు సరిపోదని డాక్టర్లు చెప్పారో వెంటనే తను వుండే వీధిలో అందర్నీ రక్తం ఇచ్చి తన తల్లి ప్రాణం కాపాడమని పేరుపేరునా అడిగింది. ప్రార్థించింది.

కానీ ఎవరూ ముందుకు రాలేదు.

"చెడిపోయిన ఆడదానికి మీ రక్తం ఎందుకు యిస్తారండి" అన్నారు కొందరమ్మలక్కలు ముందుకొచ్చిన మగాళ్ళను. కాళ్ళా,వేళ్ళా పడి బ్రతిమాలింది. సుజాత. ప్రార్థించింది, కానీ సమాజం మనసు కరగలేదు.

చరిత్ర తిరగవేస్తే బాధాదగ్ధ హృదయాలకు యేనాడు సానుభూతిని పంచింది యీ సమాజం ....

అలాగ ఆమె తల్లిని పోగొట్టుకుంది. తను అనాధగా మిగిలిపోయింది.

ఏ రక్తం కోసమయితే తన తల్లి ప్రాణాలు అలమటించి, ఆక్రోశించి అంతిమశ్వాసలు విడిచి తనను అనాధను చేసి విడచేయో అటువంటివారి ప్రాణాలను కాపాడి వారి సంతానం అనాధలు కాకూడదని, తన వొంట్లో శక్తి ఉన్నంతవరకు, తన రక్తం సమాజ సంక్షేమానికి ఉపయోగపడితే తన జీవితం చరితార్థమవటమేకాక తన తల్లి ఆత్మకు శాంతి లభిస్తుందన్న ఆశతో ఈ నిర్ణయం తీసుకుంది సుజాత.

• • •

ఇద్దరిమధ్యా బరువైన నిశ్శబ్దం ఆవరించింది. కథ చెప్పడం ముగించిన సుజాత కళ్ళనుండి కన్నీటి ముత్యాలు యేట్లని బుగ్గలమీద జాలువారతున్నాయి.

నీలకంఠం చలించిపోయాడు. దగ్గరగా వచ్చి ఆమె కన్నీటిని తుడిచేడు.

ఆ స్పర్శ ఆమెకు ఎంతో ఉపశమనం కల్గించింది ఇద్దరి మధ్యా ఏదో భాషకందని అనుబంధం బలవత్తరంగా పేనుకుపోతోంది.

"అయితే సుజాతా నువ్వు నాదగ్గర కొచ్చి వుండమ్మా. నా కన్నకూతురులాంటిదానివి" అన్నాడు. ఆ గొంతులో ఆర్ద్రత చిందులాడింది.

"వద్దండి. మీ అభిమానానికి చాలా కృతజ్ఞురాలను. కాని కాలుష్యంతో కాలుతున్న ఈ సమాజంలో ఒంటరిగా ఎలా బ్రతకాలో నాకు నేర్పింది మా అమ్మ" అంది. ఆమె కంఠంలో పట్టుదల తొంగిచూసింది.

మరేం ఆలోచించలేకపోయారు, నీలకంఠం. శూన్యమైపోయిన అతని మస్తిష్కంలో ఆమె జీవితాన్ని మలిచిన అమృతమూర్తిని చూడాలన్న కోరిక కలిగింది.

"నీకు అభ్యంతరం లేకపోతే నిన్ను యింత వున్నతంగా మలచిన నీ మాతృమూర్తిని చూడాలని వుంది."

నిశ్శబ్దంగా లేచి గదిలోకి వెళ్ళి ఆల్బమ్ తీసుకొచ్చి ఆయన చేతిలో వుంచింది సుజాత.

తెరవగానే ఆల్బమ్‌లోవున్న ఫొటోను చూడగానే అతని నవనాడులు కృంగిపోయాయి.

భూప్రదక్షిణం ఆగిపోయిందా అనిపించింది.

అదే నవ్వు. చాలా సంవత్సరాల క్రితం తనని వశపరచుకున్న నవ్వు. తాను యింతకాలం గుండెల్లో దాచుకొని ఆ నవ్వుతో బ్రతుకుతున్న నవ్వు! ఇన్నేళ్ళకుమళ్ళీకన్పించేసరికిచలించిపోయాడు.

"నన్ను, ప్రేమించి నా జీవితాన్ని అనుభవించి అంతస్తు లేదనీ, మతం లేదనీ, హీనకులమనీ పెళ్ళికి నీ వాళ్ళు అభ్యంతరం పెట్టేసరికి, ఆ పద్మవ్యూహం ఛేదించలేనంత బలహీనుడవై పారిపోయావు. నీ ప్రతిరూపాన్ని భరిస్తున్న నన్ను విడిచి నా ప్రేమను, కల్మషంలేని కోరికలను, నా హీనకులం అంతస్థూ, ఏదీ అడ్డురాలేదు. నమ్మకద్రోహంచేసిన నేరానికి శిక్షలేకుండా తప్పించుకున్నావు. నిన్ను నమ్ముకున్న విశ్వాసానికి, చేయని నేరానికి దారుణంగా అనుభవించాను శిక్ష. చెడిపోయిన ఆడదని చెరిగిపోని ముద్ర పడిపోయింది, నా జీవితంమీద. కానీ యివాళ నా కూతురు రక్తం నీ శరీరంలో అణువణువునా ఆక్రమించి శ్వాస పీలుస్తోంది. ఎక్కడికి పారిపోగలవు యిప్పుడు చెప్పు. నీ కులం యేమిటి? నీ మతం ఏమిటి? నీ అంతస్థు యేమిటి? కులట కూతురి రక్తం వుందని చచ్చిపోతావా? చెప్పు. చెప్పు..." ఆ నవ్వులో జవాబివ్వలేని ప్రశ్నలు ప్రతిధ్వనిస్తున్నాయి, దిక్కులంతటా.

ఈసారి పారిపోలేదు పిరికివాడిలా నీలకంఠం. నెమ్మదిగా లేచి సుజాతను దగ్గరగా తీసుకుని నుదుట ముద్దుపెట్టుకున్నారు, వాత్సల్యం, మమతలు నిండిన నిండుగుండెలతో.

———